
సాక్షి
బాపట్ల

శనివారం । 25 । జనవరి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 556.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.



83,066 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు 75,159 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 83,066 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

కొనసాగుతున్న నీటి విడుదల



మాచర్ల : నాగార్జున సాగర్ కుడి కాలువకు గేట్లు ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం 22 అడుగుల ఎత్తులో విడుదల కొనసాగిస్తూ... సాగు, తాగు నీరు అందిస్తున్నారు. మార్చి నెల వరకు విడుదల చేయనున్నారు.

న్యూస్‌రీల్

గీత కులాలకు మద్యం దుకాణాలు కేటాయింపు



బాపట్ల: గీత కులాలకు రిజర్వు చేసిన మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం లాటరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో 12 మద్యం దుకాణాలకు పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించామన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పకడ్బందీగా మద్యం దుకాణాలు కేటాయించామన్నారు. గౌడ్ కులాలకు నాలుగు, గౌడ కులస్తులకు ఎనిమిది దుకాణాలు లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు కలెక్టర్ చెప్పారు. చీరాల టౌన్, కారంచేడు, నగరం, రేపల్లె గ్రామీణ ప్రాంతాలలో గౌడ్ కులస్తులకు మద్యం దుకాణాలు దక్కాయన్నారు. బాపట్ల పట్టణం, రేపల్లె, అద్దంకి గ్రామీణ ప్రాంతం, అమర్తలూరు, ఇంకొల్లు, చుండూరు, జె పంగులూరు, వేటపాలెం ప్రాంతాలలో గౌడ కులాలకు దుకాణాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి.దేవదత్, బాపట్ల సహాయ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనస్వామి ఆలయంలో విశేష కుంకుమార్చన




తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత గోవర్ధనస్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం విశేష కుంకుమార్చన నిర్వహించారు. 211 మంది సువాసినులతో వేద పండితులు రఘు, మాధవ, కేశవలు ఈ పూజను జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి మల్లీశ్వరి అనుమతితో శ్రీహరినామ సంకీర్తన బృందం గురువు పెరవలి వంశీకృష్ణ నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యదర్శి ఈ. అమ్మడు నిర్వహణలో జరిగింది. లోక కల్యాణార్థం చేసిన ఈ కుంకుమార్చన ఫలితంగా మనసులో ఉన్న కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. కార్యక్రమంలో అందె బాలచంద్ర మౌళి, మాదాల సాయి హనుమంతరావు, నందికంటి రామాంజనేయులు, సంకీర్తన బృందం మాదాల నాగఅర్చన, అందె రాజేశ్వరి, తన్మయి, తూనుగుంట్ల దుర్గా మల్లేశ్వరి, కొప్పురపు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు

27న గణపతి సచ్చిదానంద స్వామీజీ రాక



నగరంపాలెం: చౌడవరంలోని దత్తనాథ క్షేత్రం ఆశ్రమానికి ఈనెల 27న అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, ఉత్తరాధిపతి శ్రీ శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ విచ్చేస్తున్నారని ట్రస్టీ బి.సీతారామిరెడ్డి తెలిపారు. మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ట్రస్టీ డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ 56 రోజులు విశ్వ ధర్మ ప్రచారం పేరుతో ఏపీలో పర్యటిస్తున్నారని చెప్పారు. 27వ తేదీ సాయంత్రం ఆశ్రమానికి రానున్నట్లు తెలిపారు. 28న ఉదయం గోపూజ, శ్రీ చక్రార్చన, హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం నాదబ్రహ్మ శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆంజనేయ రాగసాగర 'నాద ధ్యాన చికిత్సా కచేరి' ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ పి.గోపీకృష్ణ, ట్రస్టీలు మిట్టపల్లి రాజేంద్రబాబు, వి.డి.గాంధీ, బి. జయలక్ష్మి పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 56, బ్యాంక్ కెనాల్‌కు 148, తూర్పు కెనాల్‌కు 220, పశ్చిమ కెనాల్‌కు 130, నిజాంపట్నం కాలువకు 120, కొమ్మమూరు కాలువకు 733 క్యూసెక్కులు వదిలారు.

ఉచితం మాటున దోపిడీ

- హద్దులు ఒకచోట.. తవ్వకాలు మరో చోట
- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు మంగళం
- వాల్టా చట్టం ఉల్టా
- అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంలో ప్రభుత్వ శాఖల వైఫల్యం
- కూలీల పొట్టకొడుతున్న క్వారీ నిర్వాహకులు

భారీ యంత్రాలతో రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు



గాజుల్లంక వద్ద రాత్రి వేళ లారీకి ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

కొల్లూరు: కృష్ణా తీరం పచ్చ నేతల అక్రమాలకు అడ్డాగా మారింది. జిల్లాలో ఇసుక అవసరాలు తీర్చడానికి కేటాయించిన ఏకైక ఉచిత ఇసుక క్వారీ గాజుల్లంక. కూటమి నేతలు బినామీలను అడ్డుపెట్టుకొని ఈ క్వారీని దక్కించుకున్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను, వాల్టా చట్టాలను తుంగులో తొక్కి నదిలో భారీ యంత్రాలను వినియోగించి రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఉచిత ఇసుక పేరుతో నదీ గర్భాన్ని తోడేస్తున్నారు.

భారీ యంత్రాలతో తవ్వకాలు

తొలుత తులసీ కన్‌స్ట్రక్షన్ పేరిట ఇసుక తవ్వకాలకు జిల్లా యంత్రాంగం అనుమతులు మంజూరు చేసింది. అనుమతులు పొందిన నిర్వాహకులు ఆది నుంచి అక్రమాలకు పాల్పడటంతో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో వారి అనుమతులను అధికారులు రద్దు చేశారు. అనంతరం గతంలో క్వారీని దక్కించుకున్న అధికార పార్టీకి చెందిన వ్యక్తులే మధు ఇన్‌ఫ్రా పేరుతో తిరిగి అనుమతులు పొంది క్వారీని ప్రారంభించారు. నదిలో భారీ యంత్రాలను వినియోగించరాదన్న గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలను అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదు. భారీ యంత్రాలతో నదీ గర్భాన్ని కొల్లగొడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పొక్లెయిన్‌లను వినియోగించి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. వాల్టా చట్టం నిబంధనలు అతిక్రమించి నీటి ఊట లు బయటపడేలా ఇసుక తవ్వకాలు చేపట్టుడుతున్నారు.

హద్దులు దాటుతున్నారు..

క్వారీ నిర్వాహకులు హద్దులు దాటుతున్నారు. 4.95 హెక్టార్ల విస్తీర్ణంలో 62,857 మెట్రిక్ టన్నుల ఇసుకను కూలీల ద్వారా తవ్వకాలు చేపట్టి ఒడ్డుకు చేర్చుకుని యంత్రాల ద్వారా వాహనాలకు లోడింగ్ చేసుకోవడానికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. రీచ్ నిర్వాహకులకు కేటాయించిన సర్వే నంబర్లు, జియో క్వార్డినేట్స్‌కు పొంతన లేకుండా వేరే ప్రాంతంలో కృష్ణా జిల్లా హద్దులను అనుకొని యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలించుకుపోతున్నారు. నిబంధనల మేరకు డంపింగ్ యార్డులో లారీలకు ఇసుక లోడింగ్ చేయాల్సి ఉండగా, కూటమి పార్టీ నాయకుల అండదండలతో నేరుగా లారీలను నదిలోకి దించి ఇసుక లోడింగ్ చేస్తున్నారు.

కూలీలకు అన్యాయం

సాయంత్రం ఆరు గంటలలోపు కూలీలతోనే ఇసుక తవ్వకాలు చేయించాలన్న నిబంధనలను క్వారీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ కూలీల పొట్టగొడుతున్నారు. గతంలో నదీ తీర గ్రామాలలో వందలాది మంది కూలీలు ఇసుక తవ్వకాల ద్వారా ఉపాధి పొంది జీవనం గడిపేవారు. నదిలో 10 నుంచి 12 అడుగుల లోతులో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ఫలితంగా కూలీలకు తీరని అన్యాయం జరుగుతుంది.

భూగర్భ జలాలకు ముప్పు

నిబంధనలకు విరుద్ధంగా నదిలో ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో కృష్ణా తీరంలో భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడుతుందని తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సముద్రపు జలాలు గాజుల్లంక సమీపం వరకు చొచ్చుకొని వస్తున్న తరుణంలో పొక్లెయిన్‌తో భారీ అగాధాలు పెట్టి ఇసుక తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జలాలు ఉప్పు నీటిమయంగా మారే ప్రమాదం ఉంది. తాగు, సాగునీటికి తిప్పలు తప్పవు.

నిద్ర మత్తులో ప్రభుత్వ యంత్రాంగం

కృష్ణా నదిలో భారీ యంత్రాలను వినియోగించి ఇసుక తవ్వకాలు జరుపుతున్నా ప్రభుత్వ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అందుకు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానికులకు తాయిలాలు

తమ అక్రమాలకు స్థానికుల నుంచి అభ్యంతరాలు ఎదురుకాకుండా తాయిలాలు ఆశ చూపుతున్నారు. ఆలయ అభివృద్ధి పేరుతో నగదు ముట్టచెప్పడానికి స్థానికులతో ఒప్పందం చేసుకున్నారు. వచ్చే నెల 5 వరకు ప్రతి వారం ఆలయానికి రూ.50 వేలు చొప్పున ఇవ్వడానికి, 5వ తేదీ నుంచి ఈ ధరలో మార్పు చేసి మరింత పెంచడానికి నిర్వాహకులు అంగీకరించినట్లు సమాచారం.



నీటి ఊటలు బయటపడేలా ఇసుక తవ్వకాలు

నిష్పక్షపాతంగా పనిచేయండి



ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కమాండ్ కంట్రోల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ, పక్కన ఐజీ

- కుల, మతాలకతీతంగా పనిచేస్తేనే గుర్తింపు
- పనితీరులో ఆరోపణలు రానప్పుడే ఉన్నత స్థాయికి
- పోలీస్‌లకు డీజీపీ ద్వారకా తిరుమలరావు సూచన
- కారంచేడులో సిబ్బంది విశ్రాంతి భవనం ప్రారంభం
- డీజీపీకి కారంచేడు ప్రజల పౌరసన్మానం
- పోలీస్ బాస్‌ను సత్కరించిన జిల్లా పోలీస్ యంత్రాంగం

కారంచేడు: కారంచేడు పోలీసుస్టేషన్ స్థాపించిన తరువాత ఇంత వరకు డీజీపీ వంటి అత్యున్నత స్థాయి అధికారి సందర్శించడం ఇదే మొదటి సారి. గ్రామంతో సత్సంబంధాలు కలిగిన ఏపీ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శుక్రవారం కారంచేడులో పర్యటించారు. పోలీస్‌స్టేషన్ వద్ద స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడే ఆయన మొక్క నాటారు. పోలీస్‌స్టేషన్ భవనం పైన ఇటీవల నిర్మాణం చేపట్టిన సిబ్బంది విశ్రాంతి భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో వైష్ణవీ దుర్గామాత ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. స్థానిక యార్లగడ్డ వారి కల్యాణ మండపంలో ఆయనకు గ్రామస్తులు పౌరసన్మానం చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం మొదటి సారిగా జిల్లాకు వచ్చిన డీజీపీని గజమాలతో సత్కరించారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ కుల, మతాలు, ప్రాంతాలకతీతంగా పోలీస్ సిబ్బంది పనిచేయాలన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పోలీస్‌లకు సూచించారు. మన పనితీరులో అవరోధాలు, ఆరోపణలు రానప్పుడే అత్యున్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. పోలీస్‌లు తరచూ యూనిఫాంలో కనిపించకపోయినా, తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. నూతన టెక్నాలజీని ఉపయోగించి ఇప్పటికే రాష్ట్రంలో అనేక నేరాలను ఛేదించామన్నారు. కష్టపడి పనిచేసినప్పుడు పోలీస్ సిబ్బందికి ప్రజల నుంచి ఉన్నతాధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజలతో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన సూచించా రు. తాను అలా పనిచేశాను కాబట్టే నేడు ఈస్థాయిలో ఉన్నానన్నా రు. తనకు ఇంతగా సాదర స్వాగతంతో సత్కరించిన కారంచేడు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఉద్యోగ ప్రయత్నాన్ని కారంచేడు నుంచే ప్రారంభించానని గ్రామంతో ఆయనకున్న అనుభవాన్ని పంచుకున్నారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ తుషార్ డూడీ, చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్, ఇంకొల్లు సీఐ వైవీ రమణ య్య, కారంచేడు ఎస్ఐ వీ వెంకట్రావు పాల్గొన్నారు.



కారంచేడులో పోలీస్ సిబ్బంది విశ్రాంతి భవనం ప్రారంభిస్తున్న డీజీపీ

సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషి

- రూ.200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల
- చీరాల బాలికల సంక్షేమ హాస్టల్ ఆధునికీకరణకు రూ.36 లక్షలు విడుదల చేస్తాం
- బాలికల సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

చీరాల అర్బన్: రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. శుక్రవారం రాత్రి ఆయన చీరాలలోని సాయిప్యాలెస్ రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని, ఆనంద నిలయాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల గదుల్లో సరిపడా లైట్లు, ఫ్యాన్లు లేకపోవడాన్ని గుర్తించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం తరగతులు వారీగా విద్యార్థినులతో మాట్లాడారు. భోజనం అందరికీ సరిపడా పెడుతున్నారా? సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయిస్తామన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని నాగులపాలెంలోని హాస్టల్‌లో వాటర్ హీటర్లను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులై అందరికి సహాయపడాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి రూ.143 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల, విద్యారంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన రూ.200 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. చీరాల్లోని బాలికల వసతి గృహానికి సంబంధించి రూ.36 లక్షలు నిధులు విడుదల చేస్తామన్నారు. వీటిలో మరుగుదొడ్లు, మెష్‌లు, ఫ్లోరింగ్, లైట్లు, ఫ్యాన్లు వంటి వసతులను సమకూర్చుతామని చెప్పారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మంత్రి తనిఖీకి వస్తున్నారనే సమచారం రావడంతో హాస్టల్ ముందు ప్రాంగణంలో లైట్లు లేకపోవడంతో ఆఘమేఘాల మీద ఆ శాఖ సిబ్బంది చార్జింగ్ లైట్లు ఏర్పాటు చేశారు. ఆర్డీఓ టి.చంద్రశేఖరనాయుడు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ దెబోరా, చీరాల తహసీల్దార్ కె.గోపీకృష్ణ, చినగంజాం తహసీల్దార్ జె.ప్రభాకరరావు, టీడీపీ నాయకులు ఎం.మహేంద్రనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

బాపట్ల: రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. వెదుళ్లపల్లిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. మంత్రి మాట్లాడుతూ బాపట్లలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు మగ్గం వర్క్, కంప్యూటర్ శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు స్కూలు పుస్తకాలు, దుస్తులు అన్నీ అందజేస్తామని చెప్పారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో సీట్ల శాతం పెంచి బలోపేతం చేయడానికి తీసుకుంటామని చెప్పారు. విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.200 కోట్లతో పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వసతి గృహాల విద్యార్థులకు క్రీడలపై శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి క్రీడలో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్‌దిబోరా, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన, బాపట్ల ఆర్డీవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు ముగిసిన శిక్షణ

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో గత ఐదు రోజులుగా మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు నిర్వహిస్తోన్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) సంయుక్తంగా హైకోర్టు ఎంపిక చేసిన న్యాయవాదులకు నలభై గంటల శిక్షణ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన సమావేశానికి సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అన్నారు. సమస్యల పరిష్కారంలో కక్షిదారులే కీలక పాత్రదారులని చెప్పారు. మధ్యవర్తిత్వంలో కక్షిదారుల ప్రయోజనాలకే విలువ ఉంటుందని తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు చెన్నై నుంచి వచ్చిన అడ్వకేట్స్ సుదర్శనా సుందర్, జి.శశిదేవీలను న్యాయవాదులు సత్కరించారు.

ఆడ పిల్లలు సమస్యలను అధిగమించాలి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఆడపిల్లలు సమస్యలను అధిగమించి స్వేచ్ఛగా పెరగాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన అంబేద్కర్ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు సమస్యలు ఉంటాయని, వాటి గురించి మనం చర్చించుకోవాలన్నారు. ఏడాదిలో ఒక రోజున బాలికల సమస్యలపై పెద్ద ఎత్తున చర్చ జరగాలన్నారు. చర్చ జరిగినప్పుడు బాలికల సమస్యలు, సమాజం బాలికల పట్ల ఎలా వ్యవహరిస్తుందనే విషయం తెలుస్తుందన్నారు. తద్వారా కొంత మార్పు జరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 11 నుంచి 18 సంవత్సరాల లోపు కిశోర బాలికలు 49,535 మంది ఉన్నారన్నారు. వీరిలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సంవత్సరం బాలికలను రక్షిద్దాం–బాలికలను చదివిద్దాం అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం అనే కార్యక్రమం సందర్భంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సంతకం చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్లోరియా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జె రాజదిబోరా, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


జిల్లాలో గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో గిరిజన ప్రజల కోసం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంఘం అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు చుండూరు మండలం వలివేరు, పెనుగుదురు గ్రామాలలో శ్మశాన భూములు కావాలని అర్జీ ఇచ్చారు. వలివేరు గ్రామం గిరిజన కాలనీలో తాగునీరు, మురుగు కాలువలు ఏర్పాటుచేయాలని అర్జీలు ఇచ్చారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ గిరిజన ప్రజల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, సీపీఓ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.ప్రకాష్, డీఈఓ పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీడీఆర్‌సీ సమావేశానికి సిద్ధంగా ఉండాలి

బాపట్ల అభివృద్ధిపై సమగ్ర వివరాలతో డీడీఆర్‌సీ సమావేశానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. డీడీఆర్‌సీ సమీక్ష నిర్వహణపై మందస్తు సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన నిర్వహించారు. పీపీటీ నివేదికను పరిశీలించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టా లవ్

- యువకుడి మాయమాటలతో బెంగళూరుకు పయనమైన బాలిక
- ఆ బాలికకు తోడుగా మరో ఇద్దరు బాలికలు
- గంటల వ్యవధిలోనే ఆచూకీ తెలుసుకున్న సింగ్‌నగర్ పోలీసులు
- పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు



మాట్లాడుతున్న ఏసీపీ స్రవంతిరాయ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇన్‌స్టాగ్రామ్‌లో మూడు నెలల క్రితం పరిచయమైన ఓ వ్యక్తి మాయమాటలు నమ్మి ఓ బాలిక ఇల్లు వదిలి బెంగళూరుకు పయనం కాగా.. ఆమెకు తోడుగా మరో ఇద్దరు బాలి కలు వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతిరాయ్ తన కార్యాలయంలో ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

పెళ్లి చేసుకుంటానని మాయమాటలు..

న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన ఓ బాలిక సమీపంలోని ఓ మదర్సాలో చదువుకొని ఇంటి వద్దే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో బెంగళూరుకు చెందిన యువకుడితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. వీరిద్దరి మధ్యలో ఆ యువకుడి స్నేహితుడైన గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన వేణు(23) అనే యువకుడు రావడంతో వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వారు దూరంగా ఉంటుండగా.. మూడు నెలల క్రితం నుంచి వేణు ప్రేమ పేరుతో ఆ బాలికకు మాయమాటలు చెబుతూ వచ్చాడు. తనతో వస్తే బెంగళూరు తీసుకెళ్లి పెళ్లిచేసుకుంటానని నమ్మించడంతో అతగాడి మాటలు విన్న ఆ బాలిక విషయాన్ని తన ఇద్దరి స్నేహితులకు చెప్పింది. దీంతో ఆ ఇరువురు బాలికలు తాము కూడా బెంగళూరు వస్తామని చెప్పడంతో వేణు వారిని తెనాలికి రమ్మని చెప్పాడు. ప్రణాళిక ప్రకారం బాలికలను గురువారం రాత్రి తెనాలికి రప్పించిన వేణు అక్కడ తన స్నేహితులైన కేతవత్ యువరాజ్‌నాయక్(21), పెద్ద వెంకటేశ్వర్లు(30)ను బాలికలకు పరిచయం చేశాడు. ఉదయాన్నే బెంగళూరుకు రైలులో వెళ్దామని, టికెట్లు కూడా తీసుకున్నామని బాలికలకు చూపించాడు. ఈ రాత్రికి మనం అందరం గుంటూరు జిల్లా చేబ్రోలులోని పెద్ద వెంకటేశ్వర్లు ఇంట్లో ఉందామనుకొని పయనమయ్యారు.

గంటల వ్యవధిలో బాలికల ఆచూకీ..

ముగ్గురు బాలికలు కనిపించడం లేదంటూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో సింగ్ నగర్ సీఐ వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి.. ఎస్ఐ సేనాపతి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుల ఇన్‌స్టాగ్రామ్ ఐడీ నంబర్లు, బండి నంబర్ల ఆధారంగా పోలీసులు తెనాలి చేరుకొని బాలికలు, ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరులో ఉంటున్న బాలిక పాత స్నేహితుడు నిందితులను పట్టించడంలో పోలీసులకు సహాయం చేసినట్లు తెలిసింది. బాలికలను వీరు వేరే రాష్ట్రంలోకి తీసుకువెళ్లి వారి జీవితాలను నాశనం చేసేందుకు పన్నాగం పన్నినట్లుగా తెలుస్తోంది.

మరో కేసు కూడా..

అదేరోజు అదే ప్రాంతానికి చెందిన మూడో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలిక కూడా అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందగా ఆ బాలిక ఆచూకీని కూడా గంటల వ్యవధిలోనే గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. ఒకే రోజు రెండు కేసులలో నలుగురు బాలికల ఆచూ కీని తెలుసుకొని, కేసులను ఛేదించిన బృందాలను సీపీ రాజశేఖర్ బాబు, డీసీపీ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించినట్లు స్రవంతిరాయ్ తెలిపారు.

క్లుప్తంగా

కాలువలో పడి వృద్ధురాలు మృతి

అద్దంకి: కాలు జారి కాలువలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పట్టణంలోని శ్రీరాం నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆర్.కోటిరత్నం (72) ఇంటి వెనుక కాలనీలో ఉన్న భవనాశి పంట కాలువలో ప్రమాదవశాత్తూ కాలు జారి పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గోల్ఫ్ కోచ్ గోపీనాథ్‌కు అభినందన



పొన్నూరు: నేషనల్ గోల్ఫ్ కోచ్ సర్టిఫికెట్‌ను అందుకున్న రాజమండ్రికి చెందిన ఈర్ల గోపీనాథ్‌ను కవి డాక్టర్ కత్తి పద్మారావు అభినందించారు. శుక్రవారం పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో పద్మారావు మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన గోల్ఫ్ క్రీడకు గోపీనాథ్ కోచ్ కావడం దళితులకు గర్వ కారణమని అన్నారు. వ్యక్తిత్వ నిర్మాణాన్ని పెంచుకొని ఇంగ్లిష్ భాషను అధ్యయనం చేయడంతోపాటు, మంచి ప్రవర్తన ద్వారా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలతో రచించిన పుస్తకాలను డాక్టర్ కత్తి పద్మారావు, గోపీనాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో చుక్కా సాగర్ పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిరూరల్: సీసీఆర్‌సీ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కౌలు రైతు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ కోరారు. తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర విస్తృత సమావేశానికి శుక్రవారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు ఉన్న కౌలు రైతులు బ్యాంకు రుణం పొందేందుకు కార్డుతో పాటు ఆధార్ కార్డు ఉంటే సరిపోతుందని, దీని ద్వారా రిజర్వ్ బ్యాంక్ గైడెన్స్ ప్రకారం ఎటువంటి హామీ లేకుండా రెండు లక్షల రూపాయల రుణం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ దేశంలో తిండిగింజలు పండిస్తోంది కౌలు రైతులు అని, వారిని ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతతో పాటు బ్యాంకుల బాధ్యత కూడా ఉందని అన్నారు. కౌలు రైతులు ప్రైవేటు సంస్థలు ఇచ్చే అప్పులకు పోయి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడవద్దని, తక్కువ వడ్డీతో వచ్చే ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. కార్డులపై భూ యజమాని సంతకం అవసరం లేదని వివరించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని, తీసుకున్న రుణంపై సంవత్సరం లోగా చెల్లిస్తే వడ్డీ ఉండదని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, రంగారావు, రాజాబాబు, బైరగాని శ్రీనివాసరావు, మోర్త రాజశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనాలి

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఐదు మండలాల వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లెవీ నిబంధనల ప్రకారం రైతు వద్ద నుంచి ధాన్యం సేకరణ జరగాలని తెలిపారు. కొనుగోళ్లు జరుగుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. అనంతరం కారంపూడిరోడ్డులోని ఓ రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు పరిశీలించారు. ఐదు మండలాల తహసీల్దార్లతో మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఐదు మండలాల్లో ఎన్ని గ్రామాలు రీసర్వే చేశారని ఆరా తీశారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచిత్ర



రేపల్లె పట్టణంలో ర్యాలీ ప్రారంభించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచిత్ర

రేపల్లె రూరల్: కిశోర బాలికలపై అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ పాఠశాలలో బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు తమకు ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఎటువంటి బిడియం లేకుండా తల్లిదండ్రులతో గాని, ఉపాధ్యాయులకుగాని తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. సమాజంలో భ్రూణహత్యలు, బాల్య వివాహాలు లేకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ నిఘా ఉంచాలన్నారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలింతల ఇంటికి వెళ్లి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర కుమార్ అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ ఆడపిల్లలను, మాహిళలను ఎవరైనా ఇబ్బంది పెట్టినట్లు చూపినా, తెలిసినా సహించరాదన్నారు. సామాజిక బాధ్యతతో వారికి బుద్ధి చెప్పాలన్నారు. భ్రూణహత్యలు, శిశుహత్యలు, బాల్య వివాహాలు, వరకట్న బాధలు, గృహహింసలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదన్నారు. సీడీపీవో సుచిత్ర, రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణలను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగం సభ్యురాలు ఎస్.సుభాషిణి, ఐక్య కోఆర్డినేటర్ డాక్టర్ నరసయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెనుమూడి, కారుమూరు, చోడాయపాలెం, పిరాట్లంక, తుమ్మల గ్రామాలలో వేడుకలు నిర్వహించారు. బాలికల రక్షణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్‌లు ఝాన్సీలక్ష్మి, ప్రసన్న, రత్న ఏజెంల్, నళిని పాల్గొన్నారు.

27న 'నిధి ఆప్‌కే నికత్'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని ఈఎస్ఐసీ డీసీబీవో, కృష్ణాజిల్లా పెద్ద అవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఒంగోలులోని హెడ్ పోస్టాఫీసు ఎదుట ఉన్న పీడీసీసీ బ్యాంక్, విజయవాడ గాంధీనగర్‌లోని ఈఎస్ఐసీ బ్యాంచ్ కార్యాలయం, బాపట్లలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేటలోని కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

బీడు భూముల్లో అడవులను సాగుచేయాలి

డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ

బాపట్లటౌన్: బీడు భూముల్లో అడవులను పెంచే విధంగా క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ అన్నారు. పట్టణంలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో ఈనెల 20 నుంచి ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మాస్టర్ ట్రైనర్‌లకు అగ్రో ఫారెస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ మాట్లాడుతూ బీడు భూములను ఉపయోగించి అడవుల అభివృద్ధి చేపట్టడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని రెండు దశలుగా రూపకల్పన చేశామని, మొదటి దశలో అయిదు రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. అయిదు రోజుల్లో నాలుగు రోజులు తరగతులో అగ్రో ఫారెస్ట్రీ మోడల్స్‌కి సంబంధించిన విధానాలు, అనుకూలమైన చెట్ల జాతులు, కార్బన్ క్రెడిట్స్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఐదో రోజు ఫారెస్ట్ నర్సరీ, రైతు పొలాలను పరిశీలించడం జరిగిందన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉద్యాన, డీఆర్‌డీఏ విభాగాల నుండి 70 మందికి పైగా సభ్యులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారన్నారు. శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనర్లు గ్రామస్థాయిలో రోజుకోక గ్రామాల్లో ఉండి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రతి మాస్టర్ ట్రైనర్ సుమారు 80 -100 మంది రైతులని అగ్రోఫారెస్ట్రీ ప్రయోజనాల మీద శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ లక్ష్యం ద్వారా జిల్లా వ్యాప్తంగా 5000 మందికి పైగా రైతుల కు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనారాణి, జిల్లా అటవీశాఖ అధికారి భీమయ్య, జిల్లా ఉద్యాన శాఖాధికారి పి.జెన్నమ్మ, టోఫీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.శైలేష్ పాల్గొన్నారు.

అట్టహాసంగా అంతర కళాశాలల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



రెండు మ్యాచ్‌లలో విజయం సాధించిన ఎస్వీఆర్ఎం కళాశాల జట్టు

నగరం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాల బాలుర బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల అకడమిక్ డైరెక్టర్ వీవీ వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ ప్రారంభించారు. వెంకటేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలలో రాయితీలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ పోటీలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి ఆరు జట్లు పాల్గొన్నాయన్నారు. తొలి మ్యాచ్ నరసరావుపేట ఎంఏఎం ఫార్మసీ కళాశాల, గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడగా గుంటూరు జట్టు గెలుపొందిందన్నారు. నగరం ఎస్వీఆర్ఎం కళాశాల జట్టు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టు, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించిందన్నారు. శనివారం కూడా పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, అధ్యాపకులు శ్రీనివాసరావు, పీఈటీ సాంబమూర్తి పాల్గొన్నారు.

నరాల బలహీనతతో పలురకాల వ్యాధులు

- గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి
- డాక్టర్ సీతారామమ్మ స్మారక బంగారు పతకం ప్రదానం



డాక్టర్ సుందరాచారికి బంగారు పతకం ప్రదానం చేస్తున్న వైద్యులు

తెనాలి: నరాల బహీనతతో మారిపోయే నడక, చేతులు కదలిక, తల తిరగడం వంటి వ్యాధులను సకాలంలో కనుగొనవచ్చని, తగిన చికిత్సతో నయం చేయొచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్, గుంటూరు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ సుందరాచారి చెప్పారు. తెనాలికి చెందిన ప్రవాస భారతీయ వైద్యురాలు వడ్లమూడి సీతారామమ్మ స్మారకంగా ఐఎంఏ, తెనాలి శాఖలో ఏర్పాటు చేసిన బంగారు పతకాన్ని తొలిగా డాక్టర్ సుందరాచారికి ప్రదానం చేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సీతారామమ్మ భర్త డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, ఐఎంఏ, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ బంగారు పతకాన్ని బహూకరించారు. డాక్టర్ సుందరాచారి 'స్పెక్ట్రమ్ ఆఫ్ మూమెంట్ డిజార్డర్స్' అనే అంశంపై డాక్టర్ సీతారామమ్మ స్మారక ప్రసంగం చేశారు. డాక్టర్ అనిల్‌కుమార్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకర్‌బాబు మాట్లాడారు. ఐఎంఏ ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని ప్రియాంక, సంయుక్త కార్యదర్శి డాక్టర్ చందు ఉదయ్, కోశాధికారి డాక్టర్ శ్యాంప్రసాద్, సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, సోమశేఖర్, భానుప్రసాద్, సాంబశివరావు, విశ్వమోహనరావు, శేషగిరిరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షోభంలో చేనేత పరిశ్రమ

చేనేత జౌళి శాఖ జిల్లా కార్యాలయం వద్ద ధర్నా



సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మిక సంఘ నాయకులు

చీరాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ ధ్వజమెత్తారు. చేనేతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం చీరాలలోని చేనేత శాఖ ఏడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు భట్టిప్రోలు, ఐలవరం, రాజోలు, కనగాల, ఈపురుపాలెం, చీరాల నుంచి చేనేతలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చేనేతల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. రాష్ట్రంలో చేనేతలు అధికంగా ఉన్న చీరాల, మంగళగిరి ప్రాంతాల్లో గత కాలంగా మాస్టర్‌వీవర్ల వద్ద పెద్ద ఎత్తున చేనేత నిల్వలు పెరిగాయని, దీంతో కోట్ల రూపాయల విలువైన నేత వస్త్రాలు ఎగుమతులు లేక నిలిచిపోయాయన్నారు. ఈ కారణంతో మాస్టర్‌వీవర్లు చేనేత కార్మికులకు పని తగ్గించారన్నారు. చేనేత రంగ సమస్యలపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసినా నేత వస్త్రాలు ఎగుమతులపై ఎలాంటి ప్రయత్నం చేయలేదని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ జీవోను విడుదల చేయాలన్నారు. సహకార సంఘాల ఎన్నికలు జరపాలని.. చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని.. లేకుంటే రీయింబర్స్‌మెంట్ అమలు జరపాలని కోరారు. మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం ఇవ్వాలని డిమాండ్ చేశా రు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఏడీ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె హేమసుందరరావు, మురుగుడు సత్యనారాయణ, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి.కొండయ్య, సీఐటీ యూ డివిజన్ అధ్యక్షుడు ఎస్.బాబూరావు, చేనేత కార్మిక సంఘ జిల్లా నాయకులు డి.సత్యనారాయణ, వై.రాధ, బట్టు నాగమల్లేశ్వరరావు, వీరరాఘవయ్య, సూర్యనారాయణ, జి.మురళి, సుబ్బారావు పాల్గొన్నారు.

తగ్గిన ప్రధాన పంటల విస్తీర్ణం

లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ వై.రాధ

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ఖరీఫ్- 2024లో ప్రధాన పంటల విస్తీర్ణం తగ్గినట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వై .రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికత పద్ధతులను ఆచరించటం వల్ల ఉత్పత్తిలో గణనీయమైన లోటు నమోదు కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట కాలానికి సంబంధించిన ప్రధాన పంటలు కోత పూర్తి చేసుకుని మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నానాటికీ పెరిగిపోతున్న సాగు వ్యయం వల్ల ప్రస్తుత పంటల ధరలు రైతులకు నిరాశగానే మిగులుతున్నాయని వివరించారు. ముఖ్యంగా వాణిజ్య పంటలైన పత్తి, మిరప మార్కెట్ ధరలు బెంచిమార్కు ధరల కంటే సుమారు 3 శాతం నుంచి 5శాతం తక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. పెరిగిన ఉత్పత్తికి తోడు అధిక వర్షాల మూలంగా పంట నాణ్యత దెబ్బతినడం వల్ల గోదాములలో అధికమొత్తంలో సరుకు నిల్వ ఉండటం, ఈ ధరల పతనానికి కారణాలుగా చెప్పుకోవచ్చని తెలిపారు. కంది, పెసర విస్తీర్ణం పెరిగి, శనగ, మినుములు విస్తీర్ణం తగ్గిందని వివరించారు. ఆస్ట్రేలియా నుంచి పెరుగుతున్న శనగ దిగుమతులు, మయన్మార్ నుంచి దిగుమతి అవుతున్న కంది వల్ల ఈ పంటల ధరలు మరింత క్షీణిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పసుపు ధరలు పరోక్ష విపణిలో పెరుగుతున్నప్పటికీ, భారీగా ఉన్న నిల్వల కారణంగా ప్రత్యక్ష విపణిలో కొనుగోళ్లు మందంగా సాగుతున్నాయన్నారు. వేరుశనగ విస్తీర్ణం పెరిగినప్పటికీ రైతుకు కొంతమేర ధర ఆశాజనకంగానే ఉందని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధరకు పత్తిని కొనుగోలుచేయడంతో ఈ సీజన్‌లో రైతులకు కొంత ఊరట లభించినట్లుయిందని తెలిపారు. అంతర్జాతీయంగా పౌల్ట్రీ పరిశ్రమ నుంచి ఇంథనాల్ ఉత్పత్తి కోసం మొక్కజొన్నకు డిమాండ్ అధికమైనందువల్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయని వివరించారు. వరి పంటలో యాంత్రీకరణ వల్ల గింజలో తేమ శాతం అధికంగా ఉండటంతో, వ్యాపారులు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తునారని ఆమె వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌కు ఆహుతైన గృహం

రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం



బొడ్డువానిపాలెంలో మంటల్లో కాలిపోయిన ఇంట్లోని సామగ్రి

మేదరమెట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు వ్యాపించి ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. ఈ సంఘటన కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన చింతం వెంకటస్వామికి చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంటిలో మంటలు వ్యాపించడంతో ఇరుగుపొరుగు వారు అద్దంకి అగ్నిమాప కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిలోని మంటలను ఆర్పివేశారు. అప్పటికే అన్నీ పూర్తిగా కాలి బూడిద య్యాయి. మొత్తం రూ.10 లక్షల వరకు నష్టం ఉంటుందని బాధితులు తెలిపారు. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయా లేక ఎవరైనా నిప్పు పెట్టి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

పర్చూరులో గడ్డి వామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

పర్చూరు(చినగంజాం): పర్చూరులో శుక్రవారం గడ్డివామి దగ్ధం అయింది. శ్మశానవాటిక సమీపంలో ఉన్న గడ్డివామికి మంటలు అంటుకోవడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోనికి తీసుకొనివచ్చారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన



లక్ష్మీపురం: పట్టాభిపురంలోని రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది శుక్రవారం నిరసన తెలిపారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోరైల్వే మజ్దూర్ యూనియన్ గుంటూరు డివిజన్ అధ్యక్షుడు మంజునాథ్, కార్యదర్శి ఎం.వి ప్రసాద్ మాట్లాడారు. ఓపెన్ లైన్ సిబ్బందికి రిస్క్, హార్డ్‌షిప్ అలవెన్సు చెల్లించాలని, పాయింట్స్‌మెన్ కేటగిరీకి నాలుగు గ్రేడ్ పేలను మంజూరు చేయాలని కోరారు. రూ.4,800, రూ.5,400, రూ.6,600 గ్రేడ్ పే కలిగిన గెజిటెడ్ ఉద్యోగులందరకూ నైట్ డ్యూటీ అలవెన్స్‌ను ఇవ్వాలని తెలిపారు. యూపీఎస్‌లో మార్పుల చేసి పాత పింఛన్ విధానంలో మాదిరిగా ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం లాభాలు చేకూర్చాలని విన్నవించారు. కరువు భత్యం 50శాతానికి పెరిగినందున రన్నింగ్ అలవెన్సులో పెంపుదల చేయాలన్నారు. నిలుపుదల చేసిన డీఏ, డీఏల బకాయిలను సత్వరమే చెల్లించాలని కోరారు. యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులు కరుణశ్రీ , కోటేశ్వరరావు మాట్లాడుతూ బోనస్ చెల్లింపు విషయంలో ప్రస్తుతం నిర్ధారించిన రూ.7వేలు నెలసరి వేతన పరిమితిన తీసి వేసి ఉద్యోగులు పొందుతున్న వేతనంపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెల్లిస్తున్న చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సును పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు పొడిగించాలని కోరారు. సమావేశంలో డివిజనల్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోశాధికారి సాంబశివరావు, డివిజనల్ అధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. మజ్దూర్ యూనియన్ కోశాధికారి కృష్ణయ్య, యూనియన్ నాయకులు రవిశంకర్, ఏడీఎస్ లావణ్య, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు కె.వి.ఎస్. ప్రసాద్ ప్రసంగించారు.

నరసరావుపేటలో ఐపీ కలకలం

నరసరావుపేటటౌన్: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఐపీ కలకలం రేగింది. వ్యాపారంలో దివాళా తీసిన ఇద్దరు ప్రముఖ వ్యాపారులు ఐపీ పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామంతో వారికి నగదు, అప్పు ఇచ్చిన వ్యాపారులు కలరపాటుకు గురవుతున్నారు. ఒకరు పొగాకు వ్యాపారం చేసి అనేక మంది ప్రముఖల వద్ద వడ్డీ రూపంలో పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నారు. వడ్డీ కలిపి సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. మరొకరు చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి పట్టణంలోని వైద్యులు, ఇతర వ్యాపార రంగ ప్రముఖల వద్ద పెద్దమొత్తంలో అప్పు చేశాడు. తీసుకున్న డబ్బులు సకాలంలో చెల్లించక పోవటంతో అనుమానం వచ్చి కొందరు నిలదీశారు. దీంతో విషయం బయటకు పొక్కింది. మొత్తం రూ.150 కోట్ల వరకు కట్టాల్సి ఉంటుందని బాకీ ఇచ్చిన వాళ్లు చెప్పుకొస్తున్నారు. ఇద్దరికీ పట్టణంలో విలువైన ఆస్తులు ఉన్నాయి. ఆస్తుల కన్నా అప్పులు ఎక్కువగా ఉన్నట్లు తెలియవచ్చింది. ఈ క్రమంలో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. ఐపీ పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇది తెలిసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఐపీ పెట్టేందుకు సిద్ధమైన వ్యాపారుల తరఫున మధ్యవర్తులు రంగంలోకిదిగి.. ఆస్తులు అమ్మగా వచ్చిన డబ్బులు అందరికీ సమానంగా పంచుతామని హామీ ఇస్తున్నారు. దీన్ని కొందరు వ్యతిరేకిస్తుండగా, మరికొందరు దక్కిందే చాలు అంటున్నారు. ఫిర్యాదు అందలేదని డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు.

కోటప్పకొండ సినిమా షూటింగ్



నరసింహరాజుకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకులు

తెనాలి: రాబోయే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పల్నాడులోని ప్రముఖ దేవాలయం కోటప్పకొండ స్థలపురాణం ఆధారంగా చిత్రీకరిస్తున్న సినిమాలోని కొన్ని సన్నివేశాలను శుక్రవారం తెనాలిలో చిత్రీకరించారు. జానపద నటుడు నరసింహరాజు శివుడిగా నటించిన సన్నివేశాలను చిత్రదర్శకులు నరేష్ దోనె, మణివరన్ తీశారు. చిత్ర వివరాలను స్థానిక 'మా-ఏపీ' కార్యాలయంలో సాయంత్రం సినీ దర్శకుడు దిలీప్‌రాజా వివరించారు. మహాశివరాత్రి రోజున కోటప్పకొండకు లక్షలాది భక్తులు తరలిరావడానికి గల కారణాలను విశ్లేషిస్తూ వాస్తవ స్థలపురాణాన్ని అందమైన దృశ్యరూపంగా భక్తజనరంజకంగా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. కీలకమైన సన్నివేశాలను కోటప్పకొండలో తీసినట్టు చెప్పారు. జానపద చిత్రాల నటుడు నరసింహరాజు, బస్టాప్ కోటేశ్వరరావు, స్వాతి, ఎరబాబు, సునీత, స్వామి సత్యదేవ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. మేకప్ గండికోట జనార్దన్, కెమెరా: మైనేని హరిశ్రీనివాస్, కాస్ట్యూమ్స్ పట్నాల పార్వతి, కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం నరేష్ దోనే.

పొన్నూరు టౌన్ ఎస్ఐ సస్పెన్షన్

నగరంపాలెం: పొన్నూరు పట్టణ ఎస్ఐ రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడంతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల పొన్నూరు పట్టణ ఎస్ఐ రాజ్‌కుమార్, న్యాయవాది బేతాళ ప్రకాశరావు మధ్య చోటుచేసుకున్న ఘటనపై డీఎస్పీతో ప్రాథమిక విచారణ చేయించారు. నివేదిక ఆధారంగా ఎస్ఐపై సస్పెన్షన్, ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్లు జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.